# గెలుపు

శ్రీనివాసరావు సిగరెట్లు మానెయ్యాలని మళ్ళీ గట్టిగా నిర్ణయించుకున్నాడు. గతంలో కూడా చాలా సార్లు ఇంతకన్నా గట్టిగా అనుకుని కూడా మానలేకపోయేడు. అతడి బలహీనత అతడికి బాగా తెల్సు . అయినా మానెయ్యాలని అనుకోకుండా ఉండలేడు. ఒక రోజు కాగితం. పెన్ను తీసుకుని లెక్కవేసి చూసుకోగా, గుండె గుభేలుమంది. మూడు వందల యాభై రూపాయల అరవై పైసలు. అంటే దాదాపు నాలుగోవంతు జీతం . ధూమపానం కోసం తగలేస్తున్నాడు. తను మనిషిగాడు. అవును కాడు. పశువు ? అవును ? అందుకే సిగరెట్లు మానేయ్యాలి – అవును మానెయ్యాలి కాని మానలేడు అదే చిక్కు.

ఫోర్త్ ఫారంలో ఉండగా ఫ్యాషన్‌కోసం మొదలుపెట్టిన ఈ అలవాటు తనతో పాటే ఎదిగి మహమ్మారిలా తయారయ్యి తనను ఇనప గుప్పిట్లో పెట్టుకుని ఆడిస్తుందని ఊహించేడు కాడు. ఈ విషయం ఈ మాత్రం తెల్సున్నా సైన్స్ మష్టారు గుండె – ఊపిరి తిత్తులు ' పాఠం చెప్తుంటే క్లాసు రూము గోడ వెనకాల రహస్యంగా పొగ పీల్చుండేవాడు కాడు.

ఏది ఏమైనా ఈ సాలెగూడు నించి బయటపడాలి. ఈ బలహీనతని జయించాలి.

కాని ఎలా ? పోనీ ఎవరన్నా విజ్ఞుల్ని సలహా అడుగుతే ?

ఆ మర్నాడే తిరుపతిరావుని కలిసాడు.

ఇటువంటి విషయాల్లో తిరుపతిరావు బాగా అనుభవమున్న మనిషి సైకాలజీ స్టూడెంటు – ప్రతి విషయాన్ని లాజికల్గా ఆలోచించే తత్వం.

శ్రీనివాసరావు చెప్పినదంతా విని తిరుపతిరావు బరువుగా నిట్టూర్చాడు. జేబులోంచి నస్యండబ్బా తీసి రెండు చిటికలు పొడుంని రెండు నాసిక రంధ్రాల్లోను నిష్పక్షపాతంగా దట్టించి గోడకి జారిగిలపడి కూర్చుని ఇలా అన్నాడు.

" చూడు శ్రీనివాసరావ్ – ఈ వ్యసనం అనేది ఓ రోగం లాంటిది. మెదడుకి సంభందించిన వ్యాధి అన్ని అవయవాలకి కంట్రోల్ రూమ్ మెదడు కాబట్టి అది కాస్తా మనవశం తప్పినప్పుడు ఇలాంటి పరస్థితులు ఎదురవుతుంటాయి. అలా దీనంగా చూడకు ఈ వ్యసనాన్ని జయించే మార్గం ఉంది. నీకు సిగరెట్టు తాగాలి

అనుపించినపుడు మైండును ఆ ఆలోచన నించి వేరే దారి వైపు మళ్ళించుకోవాలి. ఇదే సలహాని చక్రధరరావు గారికిక్కూడా ఇచ్చేను ”

“ అయినెవరు ’”

“ ఆయనెవరో నీకనవసరం. కానీ సమస్య మాత్రం ఇదే. రోజుకి ఇరవై పెట్టెల సిగరెట్లు కాల్చేవాడు. చివరికి భోజనం చేస్తున్నప్పుడు, భార్యతో సరససల్లాపాల్లో ఉన్నప్పుడు గూడా చేతిలో సిగరెట్టు ఉండేది. అలాంటి వాడు నే చెప్పినట్లు పాటించి ఆ వ్యసనం బారి నుండి బయటపడ్డాడు.

“ ఇంతకీ ఆయనేం చేశాడు ? ”

“ అదే చెప్తుంటే ? సిగరెట్టు కాల్చాలన్న ఆలోచన రాగానే మైండుని వేరే పనిమీదకి మళ్ళించమని చెప్పాను ? ఆయనేం చేసే వాడంటే ఆ కోర్కె బుర్రలోకి రాగానే పంచె ఎగ్గట్టి ఇంటి ముందు మొక్కలన్నిటికి నీళ్ళు పెట్టేవాడు. అప్పటికి కోర్కె చావకపోతే చీపురు తీసుకుని ఇల్లంతా ఊడ్చేవాడు. అంట గిన్నెలు పని మనిషి సమక్షంలో పరపరా తోమేవాడు. భార్య తల్లో పేలు చూసేవాడు. పరిచయం లేని వ్యక్తుల్తో ఆప్యాయంగా మాట్లాడేవాడు. ధారాళంగా ట్రాఫిక్కున్న రోడ్డు మధ్యలో నిలబడిపోయేవాడు.

...... ఆ రోజు ఉదయం శ్రీనివాసరావు పక్కమీంచి లేస్తున్నప్పుడే గట్టిగా తనలో తాను అనుకున్నాడు. తిరుపతిరావు సలహా అమలు పరిచి చూడాలి అని ?

మొహం కడుక్కుని వచ్చేసరికి భార్య కాఫీ గ్లాసు అందించింది. న్యూస్ పేపరు చేతిలోకి తీసుకుని కుర్చీలో సెటిలయ్యేడు. పది నిమిషాల్లో పేపరు చదవటం పూర్తయింది. తరవాత పనికి వెళ్ళబోతుండగా సిగరెట్టు తాగాలన్న ఆలోచన తనకు వచ్చింది. శ్రీనివాసరావు ఒక్క క్షణం తనని తాను కంట్రోలు చేసుకుంటున్నట్లు కళ్ళు మూసుకున్నాడు. కాని కోర్కె బలంగా ఉంది. వెంటనే కళ్ళు తెరచి భార్యని పిల్చి “ చీపురెక్కడుంది ? ’ అని గద్దించి మరీ అడిగాడు. ఆవిడ భయంగా తలుపు వెనక వైపుగా చూపించింది. అంతే ? అతడు ఒక్క అంగలో వెళ్ళి చీపుర్ని చేతిలోకి తీసుకుని ఇల్లు ఊడ్చడం మొదలు పెట్టాడు. భార్య మొత్తుకుంటున్నా వినకుండా రెండు గదులూ ఊడ్చి “ హమ్మయ్య ”అని గాలి పీల్చుకుంటుండగా “ నేనెందుకు చీపురు పట్టేను ” అన్న ప్రశ్న ఉదయించడం, వెంటనే సిగరెట్టు గుర్తుకు రావడం – శ్రీనివాసరావు వెంటనే “ అంట్ల గిన్నెలెక్కడ ? ” అని అరుస్తూ దొడ్లోకి పరిగెత్తటం ఒకేసారి జరిగాయి.

☆ ☆ ☆

దాదాపు  నెల రోజుల తర్వాత  తిరుపతిరావు  శ్రీనివాసరావుని అడిగేడు “ నా సలహా  పాటించేవా? రిజల్ట్సు ఎలా ఉన్నాయి ” అని. దానికి  శ్రీనివాసరావు  అతడి వంక కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ మీ మేలు ఈ జన్మలో మర్చిపోలేను. అసాధ్యాన్ని  సాధ్యం చేశారు. సిగరెట్టిని పూర్తిగా  మానేశాను.  కాకపోతే  రోజుకి  ఇంటిని  ఇరవైనాల్గుసార్లు, ఆఫీసుని  పదిహేనుసార్లు ఊడుస్తూనే గాని ఉండలేకపోతున్నాను ….” అన్నాడు.

-------- అయ్యిపోయింది --------